క్లుప్తంగా

కొల్హాపురి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నింద్ర: స్థానిక బీసీ కాలనీలో వెలసిన గ్రామ దేవత కొల్హాపురి అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి


పంటను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పాలసముదం: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని డీపీఎం వాసు తెలిపారు. ఆయన ఆదివారం క్రిష్ణజమ్మాపురంలో రైతులు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలించారు. వేరుశనగ పంట యూనివర్సల్ మోడల్ వెరిఫై చేయడంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. కిచెన్ గార్డెన్ సూర్య మండలం మోడల్ విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు


జెండా వందనం చేస్తున్న సీఈఓ విజయ్ కుమార్ రెడ్డి, సిబ్బంది

గంగాధర్ నెల్లూరు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆదివారం సీఈవో విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జెండా ఎగురవేశారు. సీఈఓ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు రంగంలో కూడా వ్యవసాయ సహకార సంఘం భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మునస్వామి, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ అయ్యప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం అలరించింది. తిరుపతికి చెందిన శ్రీనృత్యాంజలి అకాడమీ ఆఫ్ మ్యూజికల్ డ్యాన్స్ నాట్య గురువులు సుబ్రమణ్యం, లక్ష్మీల ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరత నాట్యం ఆకట్టుకుంది. వివిధ పాటలకు కళాకారులు హర్షిత, మోక్షిత, పూర్వీఆజ్ఞా, సాత్విక, హృద్య, రక్షశ్రీ, శ్రీనిధి, కార్తీక, నిత్యప్రకాష్, జతిన్, జాశ్రిత, మాలిక, దాన్య, గురు నిశ్చల, దేదీప్య, ఓహోహాసిని ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం వేడుకగా నిర్వహించారు. అవివాహితులకు వివాహం జరగాలనే సంకల్పంతో ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలోని హోమ మండపంలో అమ్మవారిని కొలువుదీర్చి వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం చేశారు. పూర్ణాహుతితో హోమం ముగిసింది. ఇందులో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.గోపియాదవ్, ఈవో మమత, వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నేతలు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపడుతున్న పునర్నిర్మాణం పనులను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి చేపట్టాల్సిన పనుల గురించి తెలియజేశారు. ఆలయ పనులను ఆలస్యం లేకుండా నాణ్యతలో రాజీ లేకుండా చేపట్టాలని సూచించారు.

నారు పోయే.. నర్సరీ వచ్చే

- మారిన పంటల సాగు పద్ధతి
- నర్సరీలపైనే ఆధారపడుతున్న రైతులు


పెనుమూరులో ఉన్న టమాట, మిరప నర్సరీ

కార్వేటినగరం: ఒకప్పుడు టమాట, మిరప పంటలు సాగు చేయాలంటే రైతులు ముందస్తు ఏర్పాట్లు చేసుకునేవారు. తమకు కావాల్సిన నారు కోసం పొలాల్లోనే విత్తనాలు చల్లి తర్వాత నాటుకునేవారు. ఇందుకోసం నెల రోజుల సమయం పట్టేది. సాగు విస్తీర్ణం పెరగడం, తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి అవసరం కావడంతో విధానాలను మార్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో రైతులు నారు పోసుకునే బదులురెడీమేడ్‌గా మొక్కలు నాటుకునే పరిస్థితికి వచ్చారు. రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో నారును సరఫరా చేసే నర్సరీలు కూడా కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్నాయి.

టమాట సాగులో పెనుమూరు టాప్

టమాట సాగులో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పెనుమూరు మొదటి స్థానంలో ఉంది. ఇందులో భాగంగానే నర్సరీల్లో ఎక్కువగా టమాట నారు సిద్ధం చేసి రైతులకు విక్రయిస్తున్నారు.

పాత పద్ధతికి స్వస్తి

15 ఏళ్ల క్రితం టమాట, మిరప నర్సరీల మాటే లేదు. టమాట, మిరప సాగు చేసుకునే రైతులు తమ పొలాల్లోనే విత్తనాలు చల్లేవారు. 20 నుంచి 30 రోజుల మధ్యలో టమాట, మిరప నారు కొంత పెరిగేది. ఈ మొక్కలను రైతులు పొలాల్లో నాటుకునే వారు. ఒక రైతు మరో రైతుకు మొక్కలను అరువుగా ఇచ్చేవాడు. అలా ఒకరికొకరు సహకరించుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. నారు పోస్తే పంటల సాగుకు ఆలస్యం అవుతుందని నర్సరీల నుంచి మొక్కలను కొనుగోలు చేస్తున్నారు.

మొక్కను బట్టి ధర

నియోజకవర్గంలో మిరప, టమాట సాగు అధికంగా ఉంది. పెనుమూరు మండలంలో ఉన్న నర్సరీల్లో మొక్కలను బట్టి ధర పలుకుతోంది. గతంలో ఒక మొక్క 50 పైసల నుంచి 70 పైసల వరకు విక్రయించే వారు. ఇప్పుడు 75 పైసల నుంచి రూపాయి మధ్య ధర పలుకుతోంది. ఆదాయం కూడా బాగానే ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

సమయం ఆదా అవుతుందనే..



గతంలో పొలంలో దిబ్బ ఎరువులతో దుక్కిచేసిన చోట విత్తనం చల్లి టమాట, మిరప, వంగ నారును పోసుకునేవాళ్లం. మొక్కలయ్యాక నాటే వాళ్లం. ఇప్పుడు నారుపోసే రైతులు ఎవరూ లేరు. ప్రతి ఒక్కరూ నర్సరీలపై ఆధారపడుతున్నారు. మొక్కలు కొనడం వల్ల పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. సమయం ఆదా అవుతుందని ఇలా చేస్తున్నారు. –సురేష్, గంధపుపాడివారిపల్లి, పెనుమూరు మండలం

ఏటా 5 లక్షల మొక్కల విక్రయం

ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు రైతులందరూ నర్సరీకే వచ్చి మొక్కలు కొంటున్నారు. ఐదేళ్లుగా టమాట, మిరప, వంగ, మల్లె పూల మొక్కల నర్సరీని నిర్వహిస్తున్నాను. ఏడాదిలో 5 లక్షల మొక్కలు విక్రయిస్తున్నాం. పంటకు మంచి ధర పలికితే మొక్కల ధర పెరుగుతుంది. టమాట ధర పడిపోతే మొక్క 50 పైసల నుంచి 70 పైసలకు పడిపోతుంది. –ప్రకాష్, గంధపుపాడివారిపల్లి, పెనుమూరు మండలం

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు


లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రోజా

- మంత్రి ఆర్‌కే రోజా వెల్లడి
- వడమాలపేట మండలంలో గడప గడపకూ మన ప్రభుత్వం


మంత్రి రోజాను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న వృద్ధురాలు

పుత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. ఆమె ఆదివారం వడమాలపేట మండలం పాదిరేడు గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందాయా? సమస్యలు ఏమిటి అని అడిగిన దాఖలాలు లేవన్నారు. ఈ రోజు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి గుమ్మం వద్దకు వచ్చి అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని ధైర్యంగా చెబుతోందని చెప్పారు. అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. వాటితో తక్షణ అవసరాలను సమకూరుస్తున్నట్టు వివరించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో నేటి ప్రభుత్వ పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించే చంద్రబాబునాయుడు తర్వాత ప్రజలను మోసం చేయడం నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా చెప్పని కార్యక్రమాలను సైతం చేశారని, ఇదీ వైఎస్సార్ కుటుంబ నైజమన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఇందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కరుణాకర్‌చౌదరి, శేఖర్, సురేష్‌రాజు, నందయ్య, ఉమాపతి, సుదర్శన్, మురళి, మునిబాబు, వెంకటేష్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: మండలంలోని పాత వెంకటాపురం పంచాయతీ అగ్రహారంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేష్, అమ్ము సోదరుడు రంజన్, పూజ వివాహం జరిగింది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామానికి చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ సెల్విరాజా, ఎంపీటీసీ లారెన్స్, నాయకులు గుణశేఖర్ రెడ్డి, బాబునాయుడు, బలరాంరెడ్డి, బాబురెడ్డి, వెంకటరెడ్డి, కుట్టి, జాన్ సుందరం, పెద్దిరెడ్డి, శంకర్ మొదలి, మణి పాల్గొన్నారు.

నేడు పరమేశ్వరమంగళంలో మంత్రి రోజా పర్యటన

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరమంగళంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అదేవిధంగా మధ్యాహ్నం 3.30 గంటలకు నందిమంగళం సచివాయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొంది.

ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు


క్రికెట్‌ను వీక్షిస్తున్న ప్రజలు, అభిమానులు

శ్రీరంగరాజపురం: ప్రపంచ క్రికెట్ కప్ పోటీల్లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న మ్యాచ్‌ను చూసేందుకు ఎంపీపీ సరిత ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. ఎంపీపీ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సహకారంతో చిన్నతయ్యూరు గ్రామంలోని క్రికెట్ మైదానంలో ప్రజలు, క్రీడాభిమానుల, చిన్నతయ్యూరు యూత్ సౌకర్యార్థం భారత్ ఆస్ట్రేలియా ప్రపంచ కప్‌ను వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేశామన్నారు. వారికి భోజన వసతి కల్పించినట్టు చెప్పారు. గ్రామాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. సర్పంచ్ వరదమ్మ, మాజీ సర్పంచ్ బాబు, నాయకులు మణి, మోహన్, ప్రకాష్, హిమచలపతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్కలు నాటుతున్న గాలి జ్యోతి

పాలసముద్రం: విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి తెలిపారు. శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పరిశ్రమలు, వాహనాలు పెరుగుతుండడంతో వాతావరణ కాలుష్యం తీవ్రమవుతోందని చెప్పారు. దాన్ని నివారించాలంటే మొక్కలు పెంచడం ఒక్కటే పరిష్కారమన్నారు. భూ విస్తీర్ణంలో కనీసం 33 శాతం మొక్కలు ఉండాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని వివరించారు.

రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం


రైతు భరోసా కేంద్రం వద్ద మంత్రి ఆర్కే రోజా

నగరి: రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం ఉందని పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆమె ఆదివారం నంబాకంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతుకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. గతంలో విత్తనాలు, ఎరువులను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకునే వారని, నేడు రైతు భరోసా కేంద్రంలోనే అన్నీ దొరుకుతాయన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ అంటూ పక్కకు పెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగలా మార్చిందని వివరించారు. రైతు పక్షాన నిలబడే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నయ్యప్ప, ఢిల్లీ, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, వ్యవసాయ అధికారి రాఘువేంద్ర యాదవ్, ఎంపీటీసీ గుణశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పుత్తూరు: తిరుమలకుప్పంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పుత్తూరుకు చెందిన అన్నగౌరీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఇందులో స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, చర్మ, ఈఎన్‌టీ, ఎముకలకు సంబంధించి తిరుపతికి చెందిన స్పెషలిస్టు డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా ఆలయ ప్రాకారోత్సవం


ఊరేగింపునకు బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ముందుగా అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పుత్తూరు: ఆనాటి ఆ స్నేహమానంద గీతం.. ఆ జ్ఞాపకాలన్ని మధురాతి మధురం.. అని వారు ఆనందం వ్యక్తం చేశారు. పాతికేళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. ఇందుకు పుత్తూరు మండలం గొల్లపల్లిలోని జెడ్పీ హైస్కూల్ వేదిక అయింది. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. 1998–99 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులు, చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయులు దేవరాజన్, లక్ష్మీనారాయణ, సాయినాథ్, సెల్వం, భానుమతి, హరిప్రసాద్‌వర్మ, కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామ్మూర్తి

పాకాల: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తకోట రామ్మూర్తి ఎన్నికయ్యారు. స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఈఓ బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రామ్మూర్తి గత 33 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా, సంఘం నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు ప్రభు, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామయ్య, యువరాజు, చంద్రశేఖర్, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

హై లెవల్ బ్రిడ్జి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండలంలోని ఉడములకుర్తి వద్ద ఉన్న కుశస్థలి నదిపై రూ.27 కోట్లతో నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జి పనులను ఆదివారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుశస్థలి నదిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని పలు మార్లు కోరినా నాటి చంద్రబాబునాయుడి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత కుశస్థలి నది సమస్యను వివరించడంతో వెంటనే రూ.27 కోట్లు కేటాయించారని తెలిపారు. జగనన్న సారథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. తర్వలో పాతపాళ్యం, పాపిరెడ్డిపల్లి వంతెన పనులు ప్రారంభిస్తామన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని కాంట్రాక్టర్ గురవారెడ్డిని ఆదేశించారు. సర్పంచ్ చిట్టి మహేష్, నాయకులు రవిరాజు, కాలప్ప, రాజేంద్ర, గోవిందయ్య పాల్గొన్నారు.

దిశా చట్టంపై అవగాహన



పుత్తూరులో మాట్లాడుతున్న హెచ్‌ఎం దేవి, వడమాలపేటలో నివాళులర్పిస్తున్న మహిళలు

పుత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దిశా చట్టాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఆర్ చెరువు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం దేవి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవిత విశేషాలను తెలియజేశారు. ఆమె పట్టుదల, పరిపాలనా దక్షతను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి మీనాకుమారి, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ద్రాక్షాయణి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా చట్టాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు వనిత, గంగులమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోండి


భూ ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు

శ్రీరంగరాజపురం: ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని 48 బసివిరెడ్డిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రమేష్ అనే వ్యక్తి ప్రభుత్వం అమూల్ మిల్క్ సెంటర్‌కు కేటాయించిన భూమిని ఆక్రమించుకుని చదును చేస్తున్నాడని తెలిపారు. తాము అడ్డుకోవడంతో అక్రమ కేసు పెడతానని బెదిరిస్తున్నాడని వాపోయారు. గతంలో ఈ విషయాన్ని తహసీల్దార్, స్థానిక సర్పంచ్ డిల్లయ్య దృష్టికి తీసుకెళ్లామని, వారు సర్వే చేసి ప్రభుత్వ భూమిని గుర్తించారని వివరించారు. ఆదివారం సెలవు కావడంతో భూమిని చదును చేస్తున్నాడని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణ నుంచి భూమిని కాపాడాలని కోరారు.

శ్రీపల్లికొండేశ్వర స్వామివారి సేవలో జేసీ


జాయింట్ కలెక్టరుకి ఆలయ మర్యాదలు చేస్తున్న చైర్మన్, అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం తిరుపతి జాయింట్ కలెక్టరు డి.కె.బాలాజీ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రా రెడ్డి అర్చకులతో కలిసి ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభ స్వాగతం పలికి, స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం ఆలయ ప్రదోష మండపంలో ఆలయ అర్చకులతో వేదమంత్రాల నడుమ ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని కలెక్టరుకి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయానికి భూమి పూజ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధంగా చెన్నై రోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం దుకాణ సముదాయానికి పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో సుమారు రూ.70 లక్షలతో పది గదులతో దుకాణ సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పవన్‌కుమార్, బాలాజీ, కాంట్రాక్టర్లు భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌ముదిరాజ్, పీఎం చంద్ర తదితరులు పాల్గొన్నారు.